ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

విశ్వంభర, నేషనల్ బ్యూరో: దేశంలోని 6 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం రోజు నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు, కేరళం, సిక్కిం రాష్ట్రాల గవర్నర్లను బదిలీ చేయడంతో పాటుగా ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. సంబంధిత గవర్నర్లు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఈ నియామకాలు అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. తాజా మార్పుల్లో భాగంగా కేరళం గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను తమిళనాడుకు మారుస్తూ అక్కడ పూర్తి బాధ్యతలు అప్పగించారు. సిక్కిం గవర్నర్‌గా ఉన్నటువంటి ఓం ప్రకాశ్ మాథుర్ కేరళంకు బదిలీ అయ్యారు. సిక్కిం గవర్నర్‌గా బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు దుష్యంత్ గౌతమ్ నియమితులయ్యారు.

తమిళనాడుకు అర్లేకర్- కేరళంకు మాథుర్..

రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఈ ఏడాది మార్చి నుంచి తమిళనాడు గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అప్పటి గవర్నర్ ఆర్.ఎన్. రవిని పశ్చిమ్ బెంగాల్‌కు బదిలీ చేయడంతో అర్లేకర్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సమయంలో తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌తో ప్రమాణ స్వీకారం కూడా ఈయనే చేయించారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక గోవా అసెంబ్లీకి మాజీ స్పీకర్ అయిన అర్లేకర్ గతంలో హిమాచల్ ప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు కూడా గవర్నర్‌గా పనిచేశారు. ఇక ఓం ప్రకాశ్ మాథుర్ విషయానికి వస్తే 2024 జులైలో ఈయన సిక్కిం గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. రాజస్థాన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడైన మాథుర్ గతంలో రాజ్యసభ సభ్యుడిగా కూడా పనిచేశారు. ఇప్పుడు కేరళం గవర్నర్‌గా అర్లేకర్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

ఒడిశా గవర్నర్‌గా బ్రజ్ మోహన్ రామ్..

ఒడిశా కొత్త గవర్నర్‌గా బ్రజ్ మోహన్ రామ్ నియమితులయ్యారు. పాలమూ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన ఈ మాజీ ఎంపీ కంభంపాటి హరిబాబు స్థానంలో బాధ్యతలు చేపట్టబోతున్నారు. కంభంపాటి హరిబాబు 2025 జనవరిలో ఒడిశా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఒడిశా గవర్నర్‌గా నియమితులైన బ్రజ్ మోహన్ రామ్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఒడిశా అభివృద్ధి కోసం తాము చేస్తున్న సమష్టి కృషిలో ఆయన మార్గదర్శకత్వం, మద్దతు కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. ఆయన పదవీ కాలం ఒడిశా ప్రజల సేవా స్ఫూర్తిని, ఆకాంక్షలను మరింత బలోపేతం చేయాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. గవర్నర్ బ్రజ్ మోహన్ రామ్ పదవీ కాలం విజయవంతంగా, సంతృప్తికరంగా సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

కర్ణాటకకు సుధా యాదవ్..

కర్ణాటక గవర్నర్‌గా డాక్టర్ సుధా యాదవ్ నియమితులయ్యారు. మహేంద్రగఢ్ నుంచి గతంలో ఎంపీగా పనిచేసిన ఆమె నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్) మాజీ సభ్యురాలు కూడా. థావర్ చంద్ గహ్లోత్ స్థానంలో ఆమె కర్ణాటక గవర్నర్‌గా విధులు నిర్వర్తించనున్నారు. ఇక తాజా నియామకంతో ఆమె కర్ణాటక రెండో మహిళా గవర్నర్‌గా నిలవనున్నారు. అంతకుముందు 1999 నుంచి 2002 వరకు వీఎస్ రమాదేవి కర్ణాటక తొలి మహిళా గవర్నర్‌గా పనిచేశారు.

ఉత్తరాఖండ్‌కు ఢాల్ సింగ్ బిసేన్..

మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎంపీ డాక్టర్ ఢాల్ సింగ్ బిసేన్ ఉత్తరాఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆయన రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్ సింగ్ స్థానంలో బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సిక్కిం గవర్నర్‌గా గతంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన, రాజ్యసభ మాజీ ఎంపీ దుష్యంత్ గౌతమ్ నియమితులయ్యారు. తాజా నిర్ణయంతో ఇక్కడ తమిళనాడు, సిక్కిం, కేరళం గవర్నర్ల బదిలీలు జరగ్గా, ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్‌కు కొత్త గవర్నర్లు నియమితులయ్యారు. మొత్తం 6 రాష్ట్రాల్లో గవర్నర్ బాధ్యతల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇక కంభంపాటి హరిబాబు, థావర్‌చంద్ గహ్లోత్, గుర్మీత్ సింగ్‌లకు ప్రస్తుతానికి ఎలాంటి కొత్త బాధ్యతలు కేటాయించలేదు.

రాహుల్ గాంధీ పోరాటానికి దేశ ప్రజలందరూ మద్దతివ్వాలి

రాహుల్ గాంధీకి మద్దతుగా సంగారెడ్డి జరిగిన భారీ ర్యాలీలో స్పష్టం చేసిన జగ్గారెడ్డి

విశ్వంభర, సంగారెడ్డి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సోమవారం సంగారెడ్డి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి ఓల్డ్ బస్టాండ్‌లోని అంబేద్కర్ చౌక్ వరకు సాగిన ర్యాలీలో నిర్మలా జగ్గారెడ్డితో పాటు వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ''జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి'', ''మోడీ డౌన్ డౌన్'', ''రాహుల్ గాంధీ జిందాబాద్'' అంటూ ర్యాలీ పొడవునా నినాదాలు చేశారు. అంబేద్కర్ చౌక్‌కు చేరుకున్న అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, బీజేపీ దొంగ ఓట్లతో అధికారంలోకి వస్తోందని ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ వీధుల్లోకి వచ్చి పోరాడుతున్నారని, ఆయనకు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

''రాహుల్ గాంధీ ఢిల్లీ రోడ్లపై పోరాడుతుంటే మనం ఇళ్లలో విశ్రాంతి తీసుకోవడం సరైనదేనా? ఆయనకు మద్దతుగా మనమందరం వీధుల్లోకి రావాల్సిందే'' అని అన్నారు. తాను ఢిల్లీ వెళ్లగలిగినప్పటికీ, రాహుల్ గాంధీ పోరాటానికి స్థానికంగా సంఘీభావం తెలియజేయాలనే ఉద్దేశంతో సంగారెడ్డిలోనే ఉండి ర్యాలీ నిర్వహించినట్లు వివరించారు. ఓట్ల చోరీ జరుగుతోందని, బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తోందని జగ్గారెడ్డి ఆరోపించారు. ఈ అంశాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కనీసం పది మందికి వివరించి, ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆపబోమని రాహుల్ గాంధీ ప్రకటించారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆ డిమాండ్ నెరవేరే వరకు సంగారెడ్డిలోనూ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ''రాహుల్ గాంధీ రోడ్డుపై పడుకుని నిరసన తెలిపితే, మనం కూడా అదే విధంగా ఆయనకు మద్దతుగా నిలవాలి'' అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

- గ్రామాశాఖ అధ్యక్షులు కల్లు శ్రీనివాస్ రెడ్డి

విశ్వంభర, మాడుగులపల్లి : ప్రజా ప్రభుత్వంలో పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నదని ఇందుగుల కాంగ్రెస్ గ్రామాశాఖ అధ్యక్షులు కల్లు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారము మాడుగులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో మజ్జిగపు శేఖర్ రెడ్డి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు కల్లు శ్రీనివాస్ రెడ్డి , గౌరవ అధ్యక్షులు బాల్నే ఇంద్ర రెడ్డి లు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో పేద, మధ్యతరగతి కుటుంబాల చిరకాల స్వప్నమైన సొంతింటి కలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిజం చేస్తోంది అని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతోంది అన్నారు. తొలి విడతలో గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన ఇండ్ల నిర్మాణాలు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. అర్హులైన లబ్దిదారులు తమ సొంత ఇంట్లోకి అడుగుపెట్టేందుకు సంతోషంగా గృహ ప్రవేశ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు అని , పారదర్శకంగా, ఎలాంటి పక్షపాతం లేకుండా లాటరీ విధానంలో లబ్దిదారుల ఎంపిక జరగడం పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మునుగోటి యాదగిరి, గుడిపాటి శ్రీనివాస్ గుప్త , కట్టా శ్రీనివాస్ రెడ్డి, గవ్వ సైదిరెడ్డి పాల్గొన్నారు.

ఆదిలక్ష్మి అమ్మవారికి 'వజ్ర కిరీట ధారణ' మహోత్సవంలో దేప భాస్కర్ రెడ్డి

విశ్వంభర, సరూర్ నగర్ : మహేశ్వరం నియోజకవర్గంలో రామకృష్ణ పురం డివిజన్ లోని అష్టలక్ష్మీ దేవాలయంలో ఆదిలక్ష్మీ అమ్మవారికి 'వజ్ర కిరీట ధారణ' మహోత్సవం శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్యులు త్రిదండి శరగోపముని రామానుజ జీయర్స్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో అమ్మవారికి వజ్రకిరీట సమర్పణ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ చిలుక ఉపేందర్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగమల్లు శ్రవణ్ కుమార్, మేడం సుధాకర్ గుప్త ఫౌండర్ చంద్రశేఖర్ గుప్తా, ధనరాజ్ గౌడ్ ,జంగారెడ్డి,శ్రీనివాస్ గుప్తా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నిరసనలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త

విశ్వంభర, హైదరాబాద్ : ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి బారాఖంబా మీదుగా సుప్రీంకోర్టు వరకు నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన పలువురు మంత్రులు ప్రజాప్రతినిధులతో కలిసి ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించడం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడడం వంటి అంశాలపై కాంగ్రెస్ పార్టీ తన నిరసనను తెలియజేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

విశ్వంభర ,శంషాబాద్ : స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో వైభవంగా వీరలక్ష్మి అమ్మవారి అభిషేకం, సుదర్శనేష్టి ముచ్చింతల్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం శరన్నవరాత్రి మహోత్సవాలలో రెండొవ రోజు వీరలక్ష్మి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి నేత్రపర్వంగా విశేష అభిషేక మహోత్సవం జరిపించారు. విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, వీరలక్ష్మి అమ్మవారి పల్లకిసేవ, అర్చన, నివేదన , మంగళాశాసనం ఆధ్యాత్మిక కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు..

రియాద్ విమానాశ్రయంపై క్షిపణిదాడి

కామారెడ్డి వాసికి తీవ్ర గాయాలు

విశ్వంభర, రియాద్: సౌదీ అరేబియాలోని రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై శనివారం జరిగిన క్షిపణి దాడుల్లో కామారెడ్డికి చెందిన 36 ఏళ్ల షేక్ సయీద్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. రియాద్‌లోని కింగ్ ఫహద్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఆస్పత్రిలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. కామారెడ్డిలోని సైనీ బాబా కాలనీకి చెందిన షేక్ సయీద్ సుమారు 12 ఏళ్లుగా సౌదీ అరేబియాలో ఉంటున్నాడు. కొన్నేళ్లుగా రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని స్టార్‌బక్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ దాడిలో 13 మందికిపైగా మృతి చెందగా.. దాదాపు 300 మందికి గాయాలైనట్లు తెలుస్తోంది.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

విశ్వంభర, సికింద్రాబాద్: రాష్ట్రంలోని మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారిని క్రమబద్ధీకరించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను నెలకు రూ.30 వేలకు పెంచాలని కోరారు. సోమవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మైనారిటీ గురుకుల నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, నెలల తరబడి జీతాలు అందకపోవడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల విద్యా ఫీజులు, ఇంటి అద్దెలు, కుటుంబ ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

26 మైనారిటీ గురుకులాల్లో పెండింగ్ వేతనాలు చెల్లించాలి..

రాష్ట్రంలోని 26 మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్ వంటి సౌకర్యాలను పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వ గురుకులాలు, హాస్టళ్లు, కార్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిపై పని భారం అధికంగా ఉన్నప్పటికీ, వారికి తగిన వేతనాలు అందడం లేదని విమర్శించారు. నెలకు గరిష్ఠంగా రూ.15 వేల వరకు మాత్రమే వేతనం లభిస్తోందని, అది కూడా సకాలంలో చెల్లించకపోవడంతో ఉద్యోగులు ప్రైవేట్ సంస్థల వైపు వెళ్లిపోతున్నారని తెలిపారు. ఉద్యోగుల వేతనాలను నెలకు రూ.30 వేలకు పెంచి, వారికి ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

4.90 లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి..

తమిళనాడు, కేరళ, ఒడిశా, రాజస్థాన్, పంజాబ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకున్నారని ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. తెలంగాణలోనూ అదే తరహాలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 72 ప్రభుత్వ శాఖలు, 65 ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న సుమారు 4.90 లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ విధానం వల్ల ఉద్యోగుల్లో అభద్రతాభావం పెరుగుతోందని, ఇది పరిపాలనా వ్యవస్థపై ప్రభావం చూపుతోందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వారికి అన్ని హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. మైనారిటీ గురుకుల నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎండీ హుస్సేన్ షరీఫ్, అబ్దుల్లా అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ఉద్యోగులు మొరాజ్, మంగ, జయమ్మ, అనంతయ్య, అల్లం యాదయ్య, సి. రాజేందర్, నీలం వెంకటేష్, దొడ్డిపల్లి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ లో గిరిజనులకు
ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

రాష్ట్ర కమిటీ సభ్యులు యం గోపినాయక్

విశ్వంభర, రంగారెడ్డి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల హక్కులను కాల రాస్తుందని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యం గోపినాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 10 ,11 న హైదరాబాద్ సౌత్ జిల్లా లో జరిగిన రాష్ట్ర మహాసభ లో రంగారెడ్డి జిల్లా నుంచి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గా యం గోపినాయక్ ని ఎన్నికయ్యారు. ఉద్యోగులు, మహిళలు, కార్మికులు అనేకమంది పాల్గొని జయప్రదం చేశారు. హైదరాబాద్ పట్నంలో ఉన్న పేద గిరిజనులకు ఎస్ సి, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల ను భర్తీ చేయాలి అని అన్నారు .నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఆసరా పింఛన్ వెంటనే అమలు చేయాలి. మంచి నీళ్లు ,డైనేజి, రోడ్లు గిరిజనులకు చిన్న హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆదిలక్ష్మి అమ్మవారికి వజ్ర కిరీట ధారణ

విశ్వంభర, ఎల్బీనగర్ : అష్టలక్ష్మి దేవాలయం లో ఆదిలక్ష్మి అమ్మవారికి వజ్ర కిరీట ధారణ సుమారు 650 మంది భక్తుల సహకారంతో తమిళనాడు లోని విల్లిపొత్తూరు మనవాక మహాముని 23 పీఠాధిపతులు ఉత్తర అధికారి శ్రీమాత్సరమహంస పరవరాజకాచార్యులు త్రిదండి శరగోపముని జీయర్ స్వామి కరకములచేత వజ్ర కిరీట ధారణ జరిగినది. ఈ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్ర శేఖర్ గుప్త, చైర్మన్ నాగమల్ల శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ వనం యాదయ్య ,ప్రధాన కార్యదర్శి మేడం సుధాకర్ గుప్తా, కోశాధికారి దాచేపల్లి శ్రీనివాస్ ,సెక్రటరీ గోవింద్ శ్రీనివాస్, బిక్కుమళ్ళ పవన్ కుమార్, వజ్ర కిరీటం కమిటీ చైర్మన్ రుద్రంగి వెంకటేశ్వర్లు , వజ్ర కిరీటం రూపకర్త మానేపల్లి జ్యువలరీ అధినేతలు దేవాలయ ధర్మకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చైతన్యపురి డివిజన్ మారుతి నగర్ రోడ్ నెంబర్ 6 లో దుర్గ భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత రెండవ రోజు గాయత్రీ దేవి అలంకరణ భక్తులందరికీ దర్శనమిచ్చారు. డాక్టర్ వెంకటేశ్వరరావు , వారి సతీమణి పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గంధం రవి కేశవ్, భానుమతి, సాయిరవలి ,దివాకర్, యాదగిరి గౌడ్, రమ్య కాలనీ వాసులు పాల్గొన్నారు.

(విశ్వంభర, చైతన్యపురి)

నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో
ఘనంగా బతుకమ్మ సంబరాలు

విశ్వంభర, హస్తినాపురం : హస్తినాపురం లోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్, హస్తినాపురం శాఖలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ పాటలు, ఆటలతో విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను వివరించారు. పండుగల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థ ల జి ఏం గోపాల్ రెడ్డి, ఏ జి ఏం హేమంబర్,ఆర్ ఐ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ జి వి లక్ష్మి శారద పాల్గొన్నారు. సమన్వయ కర్తలు గాయత్రి, శిరీష ,పరిశోధన , అభివృద్ధి విభాగం మహేశ్వరి, మీన, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శిల్పా, ఏ ఓ లు రాజేశ్, కరుణాకర్ పాల్గొన్నారు.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా విశ్వంభర
తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108